

# నేను - నా జ్ఞాపకాలు

## – జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 2019*

*(గత సంచిక తరువాయి)*

## నాకు జ్ఞాపకం లేని "ఆ అరవై రోజులు"

అమ్మ ప్రదర్శించిన ఆత్మస్థైర్యం నాకు కొండంత బలాన్ని ఇచ్చింది.

నా స్మృతి

*(70వ పుట్టిన రోజు) సాహితీ స్వర్ణోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 2010లో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ మరియు ఢిల్లీ తెలుగు అకాడమీ వెలువరించిన అభినందన సంచికలో ప్రచురించబడిన కొందరు ప్రముఖుల సందేశాలు, నా కుటుంబ సభ్యుల అభిప్రాయాలు*

**సప్తతి**

స్వర్ణోత్సవ జీడిగుంట శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తిగారూ, నేనూ విజయనగర కాలనీ వాస్తవ్యులమే అయినా ఆయన నాకు 'రేడియో బాలయ్య' గానే సుపరిచితులు .. రేడియో నాటిక, నాటకాల ద్వారా ఎంతోమంది కళాకారుల్ని వెలుగులోకి తీసికొచ్చారు. 'దూరదర్శన్'కి కూడా ఎన్నో నాటకాలు, నాటికలు రచించి, కొన్నింటిలో నటించి పేరు గడించుకున్నారు.

వారి పిల్లలు ముగ్గురూ నాకు చిన్నప్పట్నించీ తెలుసు .. ఈనాటికి కూడా వారు (పిల్లలు) తల్లితండ్రుల్ని గౌరవిస్తూ వారి సలహాలు పాటిస్తూండటం అభినందనీయం ..శ్రీ జీడిగుంటగారు కథ, నవల, నాటక, సినీ రచయితగా ప్రముఖస్థానం సంపాదించుకున్నారు. వారు సాహితీ రంగానికి చేసిన కృషికి, గుర్తింపుగా జీ.వి.ఆర్.

సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేసి గౌరవించుకోవటం, మా సంస్థకు లభించిన అదృష్టంగా భావిస్తాను .

చిన్నవాళ్ళతోనూ, పెద్దవారితోనూ కలిసిపోతారు జీడిగుంట .. అమెరికాలో వుంటున్న వారి పిల్లల దగ్గరకు వెళ్లినా, ఆయన వారానికో, పది రోజులకో ఓసారి నాకు ఫోన్ చేసి, ఇక్కడి మా మిత్రులందరి యోగక్షేమాలు తెలుసుకోవటం స్నేహితులపై వారికి గల ప్రేమాభిమానాలను వ్యక్తం చేస్తుంది ...

*హైదరాబాదు గుడిబండి వెంకటరెడ్డి*

*02.02.2010 అధ్యక్షులు, ఆరాధన మరియు*

*జీ.వి.ఆర్. కల్చరల్ అసోసియేషన్*

వరిష్ట విద్వదగ్రజునికి ' సప్తతి అభివందనం మనకిష్టమైన రంగంలో మనం ప్రేమించే వ్యక్తి మనలను ప్రేమించే వ్యక్తిగా ప్రక్కన ఉండడం అనిర్వచనీయమైన అనుభూతి. అలా నేను అపురూపంగా ఆరాధించే వ్యక్తి అంతే ప్రేమతో

"అమూల్యమైన బహుమతిగా తన కావ్యాన్ని అంకితమిచ్చి నన్ను హృదయానికి హత్తుకున్న ఆ మహామనీషి జీడిగుంట రామచంద్రమూర్తి గారు. వృత్తిరీత్యా రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మనుగడ సాగిస్తున్న నాకు సాహిత్యమన్నా కళలన్నా ఎనలేని అభిమానం. నేను స్వయాన కళాకారుణ్ణి కాకున్నా సాంస్కృతిక సంస్థల సారధులైన రసమయి రాము, యువకళావాహిని వై.కె. నాగేశ్వరరావు, కిన్నెర రఘురాం, ఆరాధన కృష్ణయ్య గార్లతో ఉన్న సాన్నిహిత్యంతో జి.వి.ఆర్. ఆరాధనా అధ్యక్షులు గుడిబండి వెంకటరెడ్డిగారి ప్రోత్సాహంతో వారితో మమేకమై ఆ సంస్థ కార్యదర్శిగా దశాబ్దంన్నర కాలంగా సేవలనందిస్తున్న తరుణంలో ఎందరో గొప్ప వ్యక్తుల పరిచయభాగ్యం లభించింది.

ఆ కోవలోనే గత కొంతకాలంగా జీడిగుంటవారితో సాన్నిహిత్యం ఏర్పడింది. వారి " మూడు నాటికలు" కావ్యాన్ని మా జి.వి.ఆర్. ఆరాధనా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులమైన మాకుఎంతో అభిమాన పూర్వకంగా అంకితమిచ్చి తమ గొప్ప మనస్సును చాటుకున్నారు జీడిగుంటవారు. నా ఆరాధ్య రచయిత అందించిన ఆ కానుక నాకెప్పటికీ ఒక మధుర జ్ఞాపకమే.

కథకుడిగా, నాటక రచయితగా, వ్యాసకర్తగా, టి.వి. రచయితగా, రేడియో ప్రయోక్తగా లబ్ధప్రతిష్టులైన జీడిగుంట రామచంద్రమూర్తిగారి గురించి, ఒక మామూలు వ్యక్తిగా వారి సాహిత్యం గురించి మాట్లాడలేనేమోగానీ, వారి మంచి మనస్సు గురించి ఎంతైనా చెప్పగలను. కవిత్వం గొప్పదైనా, వ్యక్తిత్వం కూడా గొప్పదైతేనే ఎవరైనా రాణించేది.

ఆ లక్షణమే వారిని అగ్రేసరరచయితను చేసింది. సమీక్షకుడైతే పుస్తకంలో దూరి అందలి విషయాలను వివరించగలడు.

నాబోటివారైతే ఉన్న పరిచయంతో ముక్తసరిగా మూడుమాటలు చెప్పగలం. అంతే తప్ప అభిమానమెంతున్నా అక్షరరూపంలో వ్యక్తీకరించలేని అశక్తులమని భావిస్తూ ....

నా అభిమాన రచయిత, శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి గారికి' సప్తతి ' అభివందనాలతో, శత వసంతాలు ఆయురారోగ్యాలతో కవసయోధునిగా వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ....

*(Ln) వి.వి. రాఘవరెడ్డి*

*కార్యదర్శి, జి.వి.ఆర్.*

*ఆరాధన కల్చరల్ ఫౌండేషన్*

*ఫోన్: 9866332738*

అభినందన చందనం

జీడిగుంట 'నేనూ ఆకాశవాణి హైదరాబాదులో ఒకప్పుడు సహోద్యోగులం.! సహ రచయితలం! సహజీవనులం.

ఆయన చక్కని వాచకంగల ఆకాశవాణి ప్రయోక్త. కార్మికుల కార్యక్రమంలో ధారావాహికంగా ఆయన దశాబ్దికి పైగా వ్రాసిన స్కిట్స్' శ్రోతృ జనానందం పొందాయి.

ఆయన కథారచయిత, నవలారచయిత, ప్రయోక్త. అన్నిటికీ మించి మంచి మిత్రుడు.ఆయన ఎన్నో రేడియో నాటకాలు వ్రాశారు. ప్రొడ్యూస్ చేశారు. 1982-85 మధ్యకాలంలో మేమిద్దరం సహోద్యోగులం. మైత్రీ సంపన్నులం.

అన్నా ...! అన్నన్నా ...! ఏడు పదులు వచ్చాయా? వారికి త్వరలో (77) రెండేళ్లు ' పూర్తి కావాలి. ఇతోధిక శతాధిక గ్రంథాలు వ్రాయాలి. శరీరానికి వయస్సు వచ్చిందేమో కానీ ఆయన మనస్సు' యువతాస్ఫూర్తి'తో నిండి వుంటుంది.

శతమానంభవతి!

*శ్రీ వెంకటేశ్వర కరుణా కటాక్ష ప్రాప్తిరస్తు!*

*తిరుపతి డా. ఆర్. అనంత పద్మనాభరావు*

*20.02.2010 (విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ జనరల్, దూరదర్శన్)*

సాహితీ రంగంలో సరదా మిత్రుడు జీడిగుంట శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి, నాకు చిరకాల మిత్రుడు,

సన్నగా పొడుగ్గా–శ్వేతవెలుగుల మందహాసాలతో మిత్రులను పలకరించే ఆయన నడత ఆకర్షణీయం! జీడిగుంటతో నాకు ప్రథమ పరిచయం ఆలిండియా రేడియోలో జరిగింది. దాదాపు ముప్పై సంవత్సరాలు పైగానే ఆయసతో సాన్నిహిత్యమూ లభించింది.

జీడిగుంట, రచనా వైవిధ్యం కలిగిన నిర్దుష్ట భావాల రచయిత. ఆయన దర్శకత్వం వహించిన రేడియో నాటకాల్లో నేనూ వివిధ పాత్రలు పోషించాను. నా సాహితీ గమనాన్ని నిత్యం పరిశీలించి, నాకు తగిన అవకాశాలు రేడియోలో కల్పించిన ఆత్మీయుడు జీడిగుంట.

కాలక్రమంలో, రచనా వ్యాసంగాన్ని ఆయన ఉధృతం చేశారు. కథలు, నవలలు, హాస్యరచనలూ వ్రాయసాగారు. రచయితగా పేరు ప్రఖ్యాతలు గడించారు. మేము ఆహ్వానించినపుడు అనేక సభల్లో ఆయన చక్కని సంఘటనలు ఉదహరించేవారు. కథల్లో సహజ సృజనాత్మకతతో పాటు, సునిశిత హాస్యం కూడా వెదజల్లడం ఆయన ప్రవృత్తి.

ఆయన హైదరాబాద్ ఆకాశవాణిలో కార్యక్రమ నిర్వహణాధికారిగా ఉండగా “మాటల కెరటాలు" అనే శీర్షికను ప్రారంభించి–వేర్వేరు రంగాల్లో లబ్ధప్రతిష్ఠులైన ప్రముఖుల అనుభవాల్ని దాదాపు ఓ గంట సేపు–ధారావాహికంగా ప్రసారం చేసేవారు.

ఆ శీర్షికలో జీడిగుంట నాకూ స్థానం కల్పించారు. రేడియోలో వుంటూనే సినిమా రంగంవైపు కూడా దృష్టిసారించి ప్రముఖ నిర్మాత దుక్కిపాటి మధుసూధనరావు గారి అభిమానాన్ని అందుకుని వారికి అమెరికా అబ్బాయి 'అనే సినిమా కథను అందించారు. అనుభవజ్ఞులైన దర్శకేంద్రులు శ్రీ కె రాఘువేంద్రరావు.

వద్ద కొంతకాలం శుశ్రూష చేశారు. జీడిగుంట వ్రాసిన వందలాది కథల్ని వివిధ వార, మాసపత్రికలు ప్రచురించాయి. అలాగే మా' విశ్వసాహితి 'పత్రికలో కూడా ఆయన రచనల్ని ప్రచురించే అవకాశం నాకు లభించింది. మా సాహిత్య వేదికలను అలంకరించి అనేక విషయాలపై జనరంజకంగా సునిశితహాస్యంతో ఆయన ప్రసంగించేవారు.

'మైత్రి'కి నిష్కల్మషమైన అర్థం చెప్పిన ఆత్మీయ మిత్రుడు జీడిగుంట, ఇటీవల ఒక' నవలికల పోటీలో వారు రాసిన “ఊరుమనదిరా” నవల ఉత్తమ బహుమతి పొందింది.

అది గ్రామీణ వాతావరణం ఆధారంగా రచించబడింది. ఆ నవలలోని పాత్రల్నీ సంభాషణల్నీ ఔచిత్యంతో, నవజీవన సారంతో తొణికిసలాడిస్తూ ప్రౌఢంగా రాశారు. నవలా రంగంలో ఆయన ఎత్తుగడా, ముగింపూ ఆకర్షణీయంగా అలరారుతాయి.

ఆధునిక రచయితల్లో ప్రయోగాత్మక రచనలకూ, హాస్య రచనలకూ 'జీడిగుంట' పెట్టింది పేరు. ఆదివిష్ణు, పురాణం గోపాలచక్రవర్తి,–వంటి హాస్య రచయితల స్థాయికి జీడిగుంట కూడా ఎదగాలని కోరుకుంటున్నాను.

జీడిగుంట తన తత్వంలో ఆశావాది! శాంతి స్వభావుడు, విశిష్ఠ పరిశీలకుడు ... సహృదయుడు, సమాజంలో మంచి చెడులు గురించి విస్పష్టంగా ధైర్యంగా చెప్పగల రచయిత వినమ్రత, వివేకం, విరులు కురిపించే మందహాసాల స్వాగతాలు–జీడిగుంట పేరు చెప్పగానే నాకు జ్ఞాపకం వస్తాయి. సాహితీ చరిత్రలో నేను మరువలేని మిత్రుడు శ్రీ జీడిగుంట.

**కృష్ణానంద**

**హైదరాబాద్**

**డా ॥ పోతుకూచి సాంబశివరావు**

25.02.2010 (**విశ్వసాహితి**)

**శుభాకాంక్షలు**

హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం కార్యక్రమాలకు ఓ గుర్తింపూ, రసపుష్టి కలిగించిన కొంతమంది ప్రముఖుల్లో శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి ఒకరు. వారి రచనలూ, వాగ్ధాటీ మరువరానిది ..... 'చంద్రుడు చల్లగా ఉంటాడు. సూర్యుడు

వేడిగా వుంటాడు' అని చెప్పటం ఎంత సహజమో జీడిగుంట గారు ఆత్మీయంగా వుంటారు ' అని చెప్పటం కూడా అంతే సహజం ...! నిరాడంబరుడు, నిగర్వి, స్నేహశీలి. ఆకాశవాణి కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి ఆయన ప్రత్యేకత ఆయనదే. ఓసారెప్పుడో ఉదయతరంగిణి' కార్యక్రమం కోసం నాతో నాలుగు వారాలపాటు ఓ హాస్య కార్యక్రమాన్నిరూపొందించారు. శ్రోతలనుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది.

01.03.2010

ధ్వన్యనుకరణ సామ్రాట్

డా ॥ నేరేళ్ల వేణుమాధవ్, వరంగల్లు

*శుభాకాంక్షలు*

జీడిగుంట గారంటే ..

నాకెందుకు ఈర్య అంటే, అమ్మానాన్నల ఆప్యాయతల మీద ఆయనంత గొప్పగా తెలుగు సాహిత్యంలో ఎవరూ కథలు వ్రాయలేక పోయినందుకు. జీడిగుంట గారంటే ...

నాకెందుకు గౌరవం అంటే, ఎంతో ఉన్నతస్థాయిలో వుండీ ఎందరో కొత్త రచయితలకు ఆకాశవాణిలో అవకాశాలు కల్పించినందుకు.

జీడిగుంట గారంటే ...

నాకెందుకు కృతజ్ఞతాభావం అంటే, ఆ కొత్త రచయితల్లో నేనూ ఒకణ్ణి కాబట్టి!

ఆయన నిండు నూరేళ్లూ ఇప్పట్లాగే ఎప్పుడూ నవ్వుతూ, "బేస్ వాయిస్'తో మాట్లాడుతూ,

కనులలో స్నేహభావం కురిపిస్తూ వుండాలని ప్రార్థిస్తూ ...

యండమూరి వీరేంద్రనాథ్

25.02.2010

జయానగర్

హైదరాబాద్

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

COMMENTS